కొత్తగా వింతగా ఉంది పూర్ణకు. చనిపోవటానికి ముందటి స్థితిలాగా నిశ్శబ్దంగా చీకటిగా ఒక శిఖరపు అంచు పైన నిలబడినట్లు; ముందో వెనుకో ఒక భీకరమైన లోయ ఉన్నట్లు...

డా॥ వి. చంద్రశేఖరరావు

# పూర్ణమాణిక్యం ప్రేమకథలు

1





'వినవే చెలి పిలుపు అల్లదిగో...!'

బాలసరస్వతి పాట అపార్ట్‌మెంట్ అంతా మారుమ్రోగుతున్నట్లు వినిపిస్తుంది.

ఈ పాటే కాదు, ఉదయం నుంచి సాయంకాలందాక పూర్ణమాణిక్యం అపార్ట్‌మెంట్ నుంచి పాటలో, టీవీలోని న్యూస్ ఛానల్స్ వాళ్ల గొంతో ఏదో ఒకటి బిగ్గరగా వినిపిస్తుంది. నెల క్రితం పూర్ణమాణిక్యం కంటిచూపు మందగించింది. ప్రతి వస్తువు రెండుగా కనపడటం మొదలుపెట్టింది. స్ట్రీట్ లైట్లు నుంచి ఎర్రటి రిబ్బన్లు ఏవో చీల్చుకొస్తున్నట్టు, రోడ్డు పైన కార్లు ఒకదానిలో నుంచి ఇంకొటి దూసుకుపోతున్నట్లు, ఆకాశంలో ఎగిరే ఒంటరి పావురం వందలాది పావురాల గుంపుగా కనబడటం. 'అద్భుతమైన స్వప్నాల్ని ప్రపంచపు సర్వ సౌందర్యాన్ని' ఎరుకపరిచే ఆమె కళ్లు ఇప్పుడు క్రమంగా చీకట్లను కమ్ముకోవడం మొదలుపెట్టాయి. భయంతో ఒణికిపోలేదు పూర్ణ. అట్లాగే రోడ్డు పైన నడవడం, దగ్గర్లో వున్న శుక్రవారపు సంత నుంచి కూరగాయలు తెచ్చుకోవడం చేస్తూనే వుంది. దృశ్యాలు సరిగ్గా కనపడకపోయినా సినిమా థియేటర్స్‌కి వెళ్లి ముందు సీట్లో కూర్చోవటం, సాహసించి సిటీబస్ ఎక్కడం. ప్రపంచమంతా ఊగిపోతున్నట్లు రంగు రంగుల రిబ్బన్లుగా తెగిపోతున్నట్లు కనబడ్డా ఆమె మాత్రం 'భయం లేదు' అని తనకి తాను ధైర్యం చెప్పుకుంది. రెండు నెలల క్రితం వరకు మనోహరరావు ఆమెతో పాటు అపార్ట్‌మెంట్‌లో వుండేవాడు. ఇతనే నా ధైర్యం అనుకునేది. మనోహరరావు ఆమె జీవితంలో నుంచి అదృశ్యమైనాక ఇదిగో ఇలా పాటల్ని, గంభీరమైన మాటల్ని అపార్ట్‌మెంట్ నిండా నింపుకుంది. అపార్ట్‌మెంట్ బయట నిలబడి రోడ్డు వైపు చూస్తూనే ఉంటుంది.

మొదట్లో ఈ కంటి ఇబ్బంది ఉదయం సమయాల్లోనే ఉండేది. నిద్ర లేస్తూనే దూరంగా ఉన్న వంటగది బల్బులోంచి రక్తపు చారలు ఏవో కారుతున్నట్లు వస్తువులన్నీ పొడవుగా సాగిపోయి అటు ఇటు కదులూ ఇల్లంతా జంతులోకంలా అనిపించేది. కళ్లు గట్టిగా

నులుపుకున్నాక మళ్లీ అన్నీ వస్తువులు మామూలు స్థితికి వచ్చేవి. మనోహరరావు ఈ ఉదయపు ఇబ్బందులని గమనించి కంగారుపడేవాడు.

మనోహరరావు ఆమెతో పాటు ఆఫీసుకుకి వెళ్లి వచ్చేవాడు. సాయంకాలాలు కూడా అతను ఆమె ఆఫీసు దగ్గర ఆగి, ఇద్దరూ కలిసి బస్సులో వచ్చేవారు.

మనోహరరావుని ఆమె నాలుగేళ్ల క్రితం ఆషా అనే మానసిక వైద్యశాలలో చూసింది. ఒక అబార్షన్. మూడు సంవత్సరాల ఎనిమిది నెలలు కలసి జీవించిన ఒక మనిషి ఆమె నుంచి విడిపోవడం. మనస్సు స్పందించలేని ఒక స్థితిలోకి రావటం. ఆమె భుజాలకు మొలుచుకొచ్చే రెక్కలు అదృశ్యమై, అమె ప్రతి ఒకదానికి వణికి భయపడే మనిషిగా మారిపోవటం. మనోహరరావుని ఆమె మొదటిసారి చూడడం ఈ ఆషా మానసిక వైద్యశాలలోనే. ఆషా నర్సింగ్ హోమ్‌లో పూర్ణ వారంరోజులు ఇన్-మేట్‌గా ఉండాల్సి వచ్చింది. పూర్ణ రూమ్ ప్రక్కనే మనోహరరావు రూమ్. అయితే మనోహరరావు రూమ్ ముందు ఇద్దరు బౌన్సర్స్, అతన్ని బయటకు వెళ్లనివ్వకుండా.

ఆషా నర్సింగ్‌హోమ్‌లో చేరే సమయానికి పూర్ణలో సూసైడెల్ టెండెన్సీ వుండేది. హాస్పిటల్‌లో చేర్చుకునే ముందు పూర్ణ లాప్‌టాప్, సెల్‌ఫోన్, పుస్తకాలు అన్నీ తీసేసుకున్నారు వాళ్లు. తప్పనిసరిగా పూర్ణ ప్రక్క రూమ్‌లో ఉన్న మనోహరరావుతో స్నేహం చేయాల్సి వచ్చింది. పూర్ణకు ఒక నోట్‌బుక్, కొన్ని పెన్సిళ్లు ఇచ్చారు హాస్పిటల్ వాళ్లు- ఆమె ఆలోచనల్నీ, జ్ఞాపకాల్నీ రికార్డు చేయమని. పూర్ణ నోట్స్ నిండా మనోహర రావు గూర్చిన ముచ్చట్లే. మనోహరరావుది గంభీరమైన కంఠం. ఆయన నటుడు, ప్రయోక్త. సెంట్రల్ యూనివర్సిటీలో థియేటర్ డిపార్టుమెంట్‌లో రీడర్‌గా పని చేస్తున్నాడు. గ్రీకుశిల్పంలా అందంగా వుండేవాడు ఆయన. కంఠం ఢంకానాదంలా వెంటాడేది. మనోహరరావును కోర్టు ఆర్డర్ పై ఆషా నర్సింగ్ హోమ్‌లో వుంచారు. యూనివర్సిటీలో చెఖోవ్ 'Uncle Vanya' నాటకాన్ని రిహార్సల్స్ చేస్తుండగా తన తోటి సహనటుడ్ని ఉద్దేశపూర్వకంగా స్ప్రింగ్ నైఫ్‌తో పొడిచాడు అని అతనిపై అభియోగం. ఆ నాటకంలో మనోహరరావుది ప్రొఫెసర్ పాత్ర. దుష్ట నాయకుడి షేడ్స్ అన్నీ ఉన్న పాత్ర. రిహార్సల్ మొదలైనాక తన తోటి నటుడు L.S. Vanyaగా అద్భుతంగా నటించడం, చుట్టూ కూర్చున్న నటులు, విద్యార్థులు, ప్రొఫెసర్స్ అతనివైపు మెస్మరైజ్డ్‌గా చూడటం... అతను మనోహరరావు వైపు వెక్కిరింతగా చూడడం, 'ఏడీ నీలోని నటుడ్ని బయటకు లాగు,' అంటూ చెవి దగ్గర గొణగడం... మళ్లీ కాసేపు అయినాక 'theatre is not your cup of tea' అని వెక్కిరించడం... చివరి బాణంగా అతను మనోహర్‌కి మాత్రమే వినపడేలా, 'and after all you are a dalit, ఈ కళలన్నీ జీన్స్ ద్వారానే వస్తాయి. నీ జీన్స్‌లో ఏమున్నాయ్ మాంసము, సారాయి తప్ప,' అన్నాడు.

మనోహర్ ఉగ్రమూర్తి అయ్యాడు. మహాశివుడిలా అతని నేత్రాలు నిప్పుల్నీ, నెత్తుర్నీ చిందించాయి, డమ్మీ పిస్టల్ తీసుకుని వరుసగా మూడు రౌండ్లు అతని పై

కాల్చాడు. తుపాకీ నుంచి ఉత్తుత్తి నిప్పురవ్వలు బయటకి వచ్చాయి. కోపం తగ్గక పొడవాటి స్ప్రింగ్ నైఫ్ తీసుకుని అతని పొట్టపై రెండు మూడుసార్లు పొడిచాడు.

Anger Management - కోపం - అని కోర్టు అతన్ని నర్సింగ్ హోమ్‌లో నెల రోజుల పాటు ఉంచమందని డాక్టర్ ప్రసాదమూర్తి అంటాడు. ఈ కోపం కూడా ఫిట్స్ లాంటిదే అంటారు. బహుశా బాల్యంలో అంటుకున్న నిప్పు ఏదో ఇప్పటికీ మండు తూనే వుండి వుంటుంది. చంపాలనేంత కోపం అతని మీదనే- అతన్ని చూసినప్పుడల్లా అతన్ని ఇంకోసారి పొడవాలి అనిపించేది.

నెలరోజుల తర్వాత ఆషా నుంచి బయటకు వచ్చింది పూర్ణ. కొత్తగా మళ్లీ ధైర్యాన్ని తాగినట్లు, స్వేచ్ఛ అనే రెక్కల్ని తొడుక్కున్నట్లు, ఆషా నుంచి వచ్చినా కూడా మనోహరరావుని కలుస్తూనే ఉంది. మనోహరరావు పైన అడ్మిరేషన్, ఇష్టం. సరిగ్గా మూడు నెలల తర్వాత పూర్ణ, మనోహరరావుకి ప్రపోజ్ చేసింది, పెళ్లి చేసుకుందాం అని. మనోహరరావు మంచివాడే, గొప్ప కళాకారుడే- కాని ఈ కోపం, అసహనం వల్ల అతను డబ్బున్న తల్లిదండ్రుల్ని, బంధుమిత్రుల్ని అందరినీ వదిలేసి ఒంటరిగా జీవిస్తున్నాడు. He is like an open spirit. ఒక్కోసారి భగవంతుడిలాను, మరోసారి డెవిల్‌గాను మారగలడు. Beware of him అన్నారు పూర్ణ స్నేహితులు.

వాళ్ల పెళ్లయిన సంవత్సరం తర్వాత పూర్ణ మిత్రులందరికీ పార్టీ ఇచ్చింది. మనోహరరావు యూనివర్సిటీ ఉద్యోగానికి రిజైన్ చేసి టీవీ ఛానెల్‌లో ఒక ప్రోగ్రామ్ నడుపుతున్నాడు. అంతులేని అతని కోపం ఇప్పుడెక్కడ అని పూర్ణ ఆశ్చర్యపోతుంది. పార్టీలో మనోహరరావు హామ్లెట్ పాత్రని అద్భుతంగా నటించి చూపాడు. ఆ రాత్రి టెర్రస్ పైన అతని రూపం (కొంచెం మేకప్ కూడా వేసుకున్నాడు), రౌద్రం, సందిగ్ధం, to be or not to be అనే చింతన, అతని విషాదపు గొంతు, ఢమరుకంలా మ్రోగే అతని కంఠస్వరం- ఆ టెర్రస్‌ను దాటి అటూ ఇటూ అన్నివైపులకు ప్రయాణించి గాలిలోనో, మరో రహస్యస్థలంలోనో నిక్షిప్తం అయినట్లు పూర్ణకు అనిపించేది. ఎందు కంటే ఇప్పటికీ ఒక్కతే రోడ్ల పైన నడుస్తున్నప్పుడు హామ్లెట్ ఆమెకి ఎదురవుతూనే వుంటాడు.

పెళ్లయిన మూడేళ్ల తర్వాత మనోహర్ జీవితంలో ఒక ముఖ్యమైన సంఘటన జరిగింది. అతను ఎన్నో ఏళ్లుగా రాస్తున్న ఆరు గంటల నిడివి నాటకం సజీవ నాటకం పేరుతో రవీంద్రభారతిలో ప్రదర్శించారు. ఆ నాటకాన్ని కనీసం వంద రోజులపాటు ప్రదర్శించగలను అనుకున్నాడు. అయిదవ రోజు హాలులో పదిమందే వున్నారు. మనోహరరావు షాక్ తిన్నాడు. చాన్నాళ్ల తర్వాత లోపల నిద్రిస్తున్న కోపం, కసి బయటకు వచ్చాయి. అతని ముఖం ఎర్రగా నిప్పులు చెరుగుతున్నట్లుగా మారింది. పూర్ణ తల్లిలా మారిపోయి అతన్ని ఎంతగానో ఓదార్చింది. హోటల్‌కో, సినిమాకో తీసుకెళ్లేది, అతన్ని

ఖాళీగా వుండనిచ్చేది కాదు. పూర్ణ పెళ్లై సరిగ్గా మూడు సంవత్సరాల రెండు నెలల తర్వాత హఠాత్తుగా అదృశ్యమయ్యాడు. పూర్ణ అతని కోసం ఆదుర్దాపడింది కానీ తిరిగి వస్తాడులే అనుకుంది. పదిహేను రోజులు దాటినా కబురులేదు, ఫోన్ లేదు, కనీసం మెసేజ్ కూడా లేదు. పదహారవ రోజు మనోహర్ అక్క అంటూ ఒకావిడ ఫోన్ చేసి ఒక్కసారి ఇంటికి రాగలరా అని అడిగింది. 'He is tired of living in our times' అంటూ ఏ కారణం చూపించకుండా ఉత్తరం ముక్క అయినా రాయకుండా మనోహర్ అపార్ట్‌మెంట్ పై నుంచి క్రిందకు దూకేడట. వణుకుతున్న గొంతుతో, ''అంటే... అంటే మనోహర్ చనిపోయాడా?'' అన్నది పూర్ణ.

## 2

ఆ తరువాత నాలుగయిదు వారాలు వాతావరణం భరించలేనంత వేడిగా వుంది. ఆహ్లాదకరమైన ఋతువు ఏదో వెళ్లిపోయినట్లుగా తీవ్రమైన వడగాల్పులు... నేల గుండెపై నుంచి లేచి ప్రకాశం పైకి సాగుతున్నట్లు, ఎండ రంగు పొర ఏదో భూమి నంతటినీ కప్పినట్లుగా, ఆకుపచ్చని చెట్లు గాలి ఆడక వాలిపోయినట్లుగా, ఆకులన్నీ వాడిపోయి పసుపు రంగుని కప్పుకొని, ఊపిరాడనితనం చెట్ల పై నుండి నేలంతా పాకి ఇళ్లలోకి ప్రవేశించినట్లు కిటికి పక్కన అద్దంలో చెట్లు దుఃఖిస్తున్న చప్పుడు లాంటిది ఏదో వినబడి మధ్య రాత్రిలో మేలుకుంది పూర్ణ. ఆ చీకటిలో కంటి లోపలి రెటీనా కూడా పనిచేయక ఒక దుర్భరమైన దుఃఖపు రంగు నలుపు ఆమె చుట్టూ కమ్ముకున్నట్టుగా. ఇప్పుడు పూర్ణ దాదాపు అపార్ట్‌మెంట్‌లోనే ఉంటుంది.

తన జీవితంలో నుంచి మనోహరరావు నిష్క్రమణ ఆమెకు ఇంకా మిస్టరీలానే వుంది. ఏ లాజిక్‌కూ అందని ఒక విషాదం అది. అతని మరణంతో వడివడిగా ముందుకు సాగుతున్న ప్రయాణం ఏదో ఆగిపోయినట్టు. అప్పుడప్పుడు అతని అడుగుల చప్పుడు. ఆ అడుగులు మెల్లగా పూర్ణ దగ్గరకు చేరి ఆమె నుదుటిని ముద్దాడినట్టు, ఇంకోసారి అతను నేరుగా ఆమె కూర్చున్న సోఫా దగ్గరకు నడుచుకు వచ్చినట్టు, షేక్‌స్పియర్ నాటకాలలోని డైలాగులు రిసైట్ చేస్తున్నట్లు.

గది అంతా అతని కంఠస్వరం మారుమ్రోగుతూనే వుంటుంది. గాజు కిటికి దగ్గర నిలబడి రోడ్డుని, నగరాన్ని చూడడం అతనికి ఎంతో ఇష్టం. ఒక్కోసారి కిటికీ దగ్గర నిలబడి గాజు కిటికీని తెరిచి ఒక్కసారిగా గుంపులు గుంపులుగా పక్షులు కిటికిలోంచి ఇంట్లోకి రావడం, ఆ పక్షుల కిచకిచలు, రెక్కల టపటపలు... అదంతా కలలోని దృశ్యంలా.

ఇంకో నాలుగు వారాలు గడిచాయి. పూర్ణ కలల నిండా మనోహరరావే. పుస్తకాల మధ్యన దాచిపెట్టుకున్న పూలల్లా మనోహరరావు నిశ్శబ్దంగా ఒక అట్టబొమ్మలా కనిపిస్తాడు. ఇంకో కలలో మనోహరరావు ఒక గిఫ్ట్ ప్యాక్ ఇస్తాడు పూర్ణకి.

దానినిండా ఉత్తరాలు, అతను కొత్తగా రాస్తున్న నాటకంలోని పేపర్లు. ఆ కలలో మనోహరరావు ముఖం అమాయకంగా గొప్ప ఆశతో నిండి ఉన్నట్లుగా... చూస్తుండ గానే ఆ గిఫ్ట్ ప్యాక్‌లోని కాగితాలు, ఉత్తరాలు అదృశ్యమై అది ఒక నిర్జీవమైన చెయ్యిగా మారిపోవడం. పూర్ణకంతా ఆశ్చర్యంగా వుంది. మనోహారరావు అదృశ్యం ఆమె ఇంకా జీర్ణం చేసుకోలేక పోతోంది.

ఆరు నెలలు గడిచాయి. పూర్ణ మెల్లగా మామూలు జీవితంలోకి వస్తోంది. ఒక భవిష్యత్, ఒక కొత్త జీవితం కావాలనిపిస్తున్నాయి పూర్ణకి. అపార్ట్‌మెంట్‌కు రంగులు వేయించింది. కొత్త ఫర్నిచర్, కొన్ని కొత్త పుస్తకాలు, పాటల సీడీలు, కొత్త జీవితాన్ని మొదలుపెట్టే సమయానికి అమె కళ్లు మరొకసారి ఆమెని ఇబ్బంది పెట్టాయి. ఎదురుగా ఉన్న వస్తువులు కనిపించడం మానివేశాయి. అపార్ట్‌మెంట్లు, ఇళ్లు అడ్డ దిడ్డంగా. నడవడం చాలా కష్టమైంది పూర్ణకు. పూర్ణ కంటి డాక్టరు దగ్గరికి వెళ్లింది. చాలాసేపు పరీక్షలైనాక కంటి డాక్టరు మొహంలో ఒక నిరుత్సాహమైన నిట్టూర్పు. ఎడమ కంటిలోని ఐ బాల్ (Eye Ball) పూర్తిగా పాడైంది అని, అది లావుగా ఉబ్బి కంటిలోనికి జారి పడబోయే వస్తువులా వున్నట్లు. వారం తరువాత పూర్ణ రెండు కళ్లకు ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్‌కు రెండు రోజుల ముందు పూర్ణకు ఒక లావాటి కవరు స్పీడ్ పోస్టులో వచ్చింది. చిరునామాదారుడే కవరు తెరవాలి అనే సూచన కవర్ పై వుంది. పంపినవారి చిరునామా వింతగా ఉంది. ఉత్తరాఖండ్, హిమాలయ పాదాల దగ్గర, ఇండియా అంటూ రాసి ఉంది. పేరుకు బదులు ఆత్మీయ మిత్రుడు అని మాత్రమే ఉంది. ఆపరేషన్‌కి ముందురోజు ఇల్లంతా సర్దుతూ పూర్ణ అవసరమైన సరుకులు తెచ్చుకుంది. ఫోన్, ఎలెక్ట్రిసిటీ బిల్స్ కట్టింది. అపార్ట్‌మెంట్ బయట ఉన్న కుండీలకు నీళ్లు పోసింది. గాజుకిటికీ బేస్ కింద ఉన్న బోన్సాయ్ పూలమొక్కల్ని శుభ్రంగా తుడిచింది. ఈ బోన్సాయ్ మొక్కలన్నీ మనోహరరావు ఇచ్చిన గిఫ్ట్. ఆపరేషన్ రోజు ఉదయం పూర్ణకు మరో కవర్ అందింది. బరువైన కవరు, అదే చిరునామా.

ఉదయం పది గంటలకు పూర్ణ ఆపరేషన్ మొదలైంది. సర్జన్ ఆమెతో ప్రేమగా మాట్లాడాడు. ముఖం చుట్టూ ఆకుపచ్చ గుడ్డ చుట్టి eye lid పై ఒక స్పెరులమ్ పెట్టాడు. మెల్లగా పూర్ణ ఒక మత్తులాంటి నొప్పి తెలియనితనంలోకి వెళ్లిపోయింది. సర్జరీ గంటో, రెండు గంటలో సాగింది. మధ్యాహ్నానికి కొద్ది కొద్దిగా స్పృహ వస్తుండగా పూర్ణకు అంతా వేకువజామున వచ్చిన కలలా ఇప్పుడంతా చీకటి. కళ్ల పైన pads పెట్టారు.

కొత్తగా వింతగా ఉంది పూర్ణకు. చనిపోవటానికి ముందటి స్థితిలాగా నిశ్శబ్దంగా చీకటిగా ఒక శిఖరపు అంచు పైన నిలబడినట్లు; ముందో వెనుకో ఒక భీకరమైన లోయ ఉన్నట్లు... ఇద్దరు ముగ్గురు స్నేహితులు పూర్ణకు సాయంగా వచ్చారు.

అప్పుడప్పుడు చదివిన జోస్ సరమాగో నవల 'బ్లైండ్‌నెస్' గుర్తుకు వచ్చింది పూర్ణకు. ఆకాశంలో వచ్చిన ఒక వింత వెలుగు కారణంగా సిటీలో మనుషులంతా గుడ్డి వారవుతారు (కంటి డాక్టరుతో సహా). ఆ అంధకారంలో జీవించడం కోసం మనుషులు చేసే పోరాటాలు. పూర్ణను నడిపించుకుంటూ అపార్ట్‌మెంట్‌కు తీసుకువచ్చారు. అపార్ట్ మెంట్‌లో ఒక్కతే సోఫాలో కూర్చుని ఏ వస్తువు ఎక్కడ వుందో- అందుబాటు దూరంలో ఆహారం, మంచినీళ్లు, టాబ్లెట్లు ఉన్నాయి. కుడివైపుకు తిరిగితే అందుబాటులో మంచం. టాబ్లెట్లు వేసుకుని అలాగే మంచం పైకి దొర్లింది పూర్ణ. పగలో రాత్రో ఏమీ తెలియటంలేదు. సూర్యుని వెచ్చటి కిరణాల స్పర్శగానీ, భయం గొలిపే చీకటి దుప్పటి స్పర్శగానీ ఏదీ తెలియడం లేదు పూర్ణకి. ఆ చీకటిలో హఠాత్తుగా సెల్‌ఫోన్ మ్రోగింది. చేతులతో తడుముకుంటూ సెల్‌ఫోన్ తీసింది పూర్ణ. హలో అంటూ ఒక పరిచయమైన కంఠం వినబడింది. హలో అన్న ఆ కంఠం 'బాగా పొద్దుపోయింది కదూ' అని కూడా అంది. కాసేపైనాక ఆ కంఠమే 'నేను మనోహర్‌ని'' అంది.

మనోహర్ అని పెద్దగా అరిచింది పూర్ణ. అంటూనే, ''ఏమిటిదంతా? ఎవరు మాట్లాడేది?'' అంది.

''నేనే. పబ్లిక్ బూత్ నుంచి మాట్లాడుతున్నాను,'' అంది అవతలి వైపు స్వరం. ఫోన్ లోంచి మళ్లీ, ''ఉక్కపోతగా వుంది. ఎండ భరించలేనంతగా వుంది. రోజులు ఇట్లా ఉంటే ఎట్లా? నిన్న మనం సినిమాకి వెళ్లినప్పుడు కూడా ఇదే పరిస్థితి,'' అంది అవతలి కంఠస్వరం.

''నిన్న ఏమిటి? నువ్వు వెళ్లి దాదాపు సంవత్సరం అయ్యింది. కదా?'' అంది పూర్ణ.

''కొత్త నాటకం రాయటం పూర్తయింది, గొప్ప రిలీఫ్‌గా వుంది,'' అంది ఆ కంఠస్వరం. ''జీవితంలో చాలా తప్పులు చేశాను. ముఖ్యంగా నా తీవ్రమైన కోపాన్నీ, అన్నిటినీ సమీక్షించుకోవాలనుకుంటున్నాను.''

''మనోహర్, మనోహర్... యిది నువ్వేనా?'' అరిచింది పూర్ణ.

''పూర్ణా, జేబులోని చిల్లర అయిపోయింది,'' అంటూండగానే ఫోన్ హఠాత్తుగా ఆగిపోయింది.

ఆపరేషన్ జరిగి కొన్ని గంటలే అయింది. మత్తు కూడా పూర్తిగా వదలలేదు. ఇదంతా భ్రమే అనుకుంది పూర్ణ. లేచి గోడల్ని పట్టుకుంటూ గాజుకిటికీ దగ్గరకు వచ్చింది. కిటికీ అవతల రోడ్డు పైన చాలా చెట్లున్నాయి కాని ఏ చెట్టు ఆకూ కదులు తున్నట్లు లేదు. వారం తర్వాత పూర్ణ కళ్ల పైన పాచెస్ తీసివేశారు. సన్నటి వెలుగుల తెర కళ్ల ముందు. ఒక్కొక్కటి కళ్ల ముందు తిరిగి ప్రత్యక్షం కావడం మొదలైంది. హాస్పటల్, డాక్టర్ మొహం, బయట ఆమె కోసం ఎదురుచూస్తున్న మిత్రులు, ఆటో,

అపార్ట్‌మెంట్, మురికి మురికిగా నేలంతా నల్లగా పేరుకుపోయిన దుమ్ము, రీడింగ్ టేబుల్, టి.వి., గాజుకిటికీ, కిటికి అంచున ఉన్న బోన్సాయ్ పూలమొక్కలు, మంచం, మంచం పక్కన ఉన్న చిన్న టీపాయ్, వాటిని చూస్తూ ఉలిక్కిపడింది పూర్ణ. అవేవో వెనుకటి జీవితం తాలుకు పీడకలలా అనిపించసాగాయి. వణుకుతున్న చేతులతో రెండు కవర్లను చేతుల్లోకి తీసుకుంది. కొన్నాళ్ల పాటు చదవద్దు అని డాక్టరు చెప్పినా- కవర్లు చించింది. ఇరవై పేజీలకు పైగా ఉన్న సుదీర్ఘమైన ఉత్తరం అది. ఉత్తరం కాదు. ఎక్కడా సంబోధనా ఏమీలేవు. అదో కథలా, వ్యాసంలా- మొదటి పేజీలో పూర్ణమాణిక్యం ప్రేమకథలు అని రాసి ఉంది. మొదటి కథ ఇదిగో ఇట్లా మొదలవు తుంది. వణుకుతున్న చేతులతో పూర్ణ పేజీలను తిప్పింది.

### *పూర్ణ మొదటి ప్రేమకథ*

చెట్లనిండా సాయంకాలపు ఎండ, సిందూరపు రంగులు. సత్యసుందరం ఆమెనే చూస్తున్నాడు. ఆమె గొంతు గరుకుగా, అదేదో విచిత్రమైన పాటలా ఉంది. ఆమె జర్నలిస్టు. పల్లెలు తిరిగి స్త్రీ కార్మికుల గురించి రాస్తుంది. వ్యాసానికింతని ఆమె జీతం. ఆ సాయంకాలం... ఆమె నీలిరంగు చీర మంద్రమైన సముద్రాన్ని గుర్తు చేస్తుంది. 'ఏమిటా వెర్రిచూపులు,' అంది. అతను నవ్వేడు. ఆమె శరీరంపై ముఖ్యం గా, ఎవరూ చూడని ప్రదేశాలలో అతని పేరును పచ్చబొట్టుగా పొడిపించుకుంది. ఆమె చుట్టూ ఏదో పరిమళం. సముద్రతీరాల్లోని తడి ఇసుక, వందలుగా ఎగిరే సముద్ర పక్షులు, అలలు మోసుకొచ్చే తీరాల జ్ఞాపకాలు... అల్లాంటి వాసనేనా? లేదా లిల్లీపూలు, సన్నజాజులు, గంధపు చెక్కల వాసనా?

పూర్ణది దుఃఖపు రంగు సౌందర్యం అనుకున్నాడు సుందరం.

ఆమె మాట్లాడుతూనే ఉంది. గొర్రెల మెడలో వేలాడే బుల్లి బుల్లి గంటలు మోగినట్టుగా, లేదా సన్నటి వానజల్లు చప్పుడులా. పూర్ణ తన కథలన్నీ చెబుతుంది. ఒక్కొక్క పొరనే వలిచి, దాచి పెట్టిన రహస్యాన్ని బయటకు తెస్తున్నట్లుగా ఉప్పెనలా పొంగుకొస్తున్న జ్ఞాపకాలు... వాటన్నిటినీ దృశ్యాలుగా అనువదించుకోలేకపోతున్నాడు అతను. "మావాళ్లు ఇంకా నిద్రలోనే ఉన్నారు. మెసేజ్ కోసం ఎదురుచూస్తున్నారు," క్షణంసేపు కళ్లు మూసుకుంది. వత్తి ఆరిన రెండు దీపాలు. రెండేళ్ల స్నేహం. తరువాత కూడా, ఆమె ఏమిటో ఇంకా అతనికి అర్థం కాలేదు. 'నాకు శిశిరాలంటే ఇష్టం, ఆకు లన్నీ రాలి, కొత్త చిగుళ్ల కోసం ఎదురుచూసే కాలం అది. రాలుతున్న ఆకులన్నీ చరిత్రను పాడుతున్నట్లుగా ఉంటాయి. ఏడు గంటలు కావస్తుంది. గాలిలో కాస్త మంచు కలసి, చిన్నప్పటి అమ్మ కోపంలా ఉంది కదా,' అంది. 'మా ఇంటి వరండాలో రావిచెట్టు ఉండేది. అది వందలాది ఆకుల్ని రాలుస్తూ ఉండేది. అమ్మని ఆ ఆకుల్ని ఊడవనిచ్చేదాన్ని కాదు. అవి గుట్టలుగుట్టలుగా... రావి ఆకుల మధ్య బుద్ధదేవుడిలా

కూర్చునేదాన్ని. బుద్ధుడు అంటరానివాళ్ల దేవుడు అనేవాడు నాన్న. నేను దిగులుగా చూసేదాన్ని నాన్న వైపు.''

పూర్ణ హఠాత్తుగా మాట్లాడడం ఆపి, ''అవును, నీకు ఎనిమిదేళ్ల వయసులో కదా, మీ నాన్నకు కాన్సర్ వచ్చింది,'' అంది, దిగులు స్వరంతో. క్షణంసేపు బిగుసుకు పోయాడు సుందరం రాతి విగ్రహంలా. పూర్ణ అతని చుట్టూ చేతుల్ని పెనవేసి, కాసేపు తల్లిలా మారిపోయి. సుందరానికి అంతా గుర్తుంది, పదే పదే ప్రదర్శిస్తున్న సినిమాలా. వాళ్ల నాన్న జబ్బుపడడం, అతని పద్నాలుగో ఏట వాళ్లమ్మ అదృశ్యం అవడం అంతా... ఆ విషయాన్ని అతనెప్పుడూ పూర్ణతో మాట్లాడడు.

''బియ్యం, పప్పులతో పాటు అవమానం కూడా రేషన్‌లో దొరుకుతుంది,'' అంది పూర్ణ, కుళ్లు నాస్టాల్జియా మీద.

సుందరం నాన్న ఇంకా బ్రతికే ఉన్నాడు. మనిషంత రాచపుండుగా, బాధ కూడా తెలియనంతగా, ఇంటిలో ఒక మూలన మాంసపు ముద్దలా. తన భార్య (సుందరం వాళ్లమ్మ) అదృశ్యం అయిన సంగతే అతనికి గుర్తులేదు. చిన్న కాగితపు ముక్కల్ని వదిలి, ఆమె వెళ్లిపోతుంది. ఎక్కడికో చెప్పలేదు. ఆ తరువాత ఉత్తరాలు, కబురు లేవు. సుందరం చాలా సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాడు. ఆమె అదృశ్యం వెనుక నున్న కారణాలు ఎవరైనా వివరిస్తారేమోనని. ఉత్తరమో, ఫోటోగ్రాఫో, టెలిఫోన్ కాలో ఆమెనించి వస్తుందని- ఇంకా అతనిలో ఆశ చావలేదు. అతను బి.టెక్ డిగ్రీ తీసుకునే టప్పుడు ఆమె కోసం ఆడిటోరియమంతా వెతికేడు, క్యాంపస్‌లో ఎక్కడైనా ఒక ఒంటరి స్త్రీ నిలబడి ఉందేమోనని. సుందరానికొక దుఃఖం ఉంది. అది కనబడని నిప్పు. అతనెప్పుడూ గంభీరంగా ఉంటాడు. లోపల దుఃఖపు అర ఉన్న సంగతి ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడతాడు. ఆఖరికి పూర్ణకి కూడా. ''నాకిప్పుడు ముప్పయి రెండు,'' అన్నాడు సుందరం- వాళ్ల పెళ్లి విషయం గురించి మాట్లాడడానికి. ఇట్లాగే మొదలుపెడతాడు. 'సో' అంటుంది పూర్ణ. ''ప్రయాణించినవారి అంచునే వచ్చావు. కప్ బోర్డులన్నీ ఖాళీగా ఉన్నాయి.'' అతను విని, మౌనంగా సాయంకాలం మిగిల్చిన చివరి వెలుగును చూస్తూ.

దూరంగా ఎక్కడి నుంచో గుడిగంటలు, మైకులో పెద్ద పెద్దగా వినిపిస్తున్న భక్తి గీతాలు. ''ప్రపంచంలోని సమస్త హింసకీ ఆయనే కారణం. అయినా ఆయనకే సరెండర్ అవుతాం,'' అంది పూర్ణ. సుందరానికి పెద్దగా భక్తి లేదుగానీ, ఇంట్లో పూజ అనేది ఒక ritual. వాళ్ల నాన్న ప్రతీరోజూ గంటల తరబడి పూజా కార్యక్రమాలు చేయిస్తూ ఉంటాడు (మంచం పైనే ఉండి).

వాళ్లు నడుస్తూ ఉన్నారు. టేకుచెట్లు కొన్ని వెడల్పాటి ఆకుల్ని రాల్చి, అవి రోడ్డు నిండా పడి, లేత ఎరుపురంగులో మిలమిలలాడుతున్నాయి. ఆ ఆకుల

మధ్యలో నిలబడి, ''నాకిప్పుడు డాన్స్ చేయాలని ఉంది,'' అంది పూర్ణ ఆకులను మృదువైన పాదాలతో తాకి, వాటితో సంభాషిస్తున్నట్టుగా అటూ ఇటూ తిరిగి నాట్యపు భంగిమలో నిలబడి, గుర్తొచ్చి గుర్తు రాని పాటనేదో హమ్ చేస్తూ. సుందరానికి ఇదంతా విసుగ్గా ఉంది. ఈ చెట్లు, ఈ సాయంకాలం, ఆకులు రాలే కాలం, ఇదేమంత గొప్ప సన్నివేశం... ఇంతగా ఎగ్జైట్ కావడానికి అనుకున్నాడు. ఇదంతా తెచ్చి పెట్టుకున్న ఆత్మానందం అనుకున్నాడు. పూర్ణ రాలిన ఆకుల మీద అట్లాగే అడుగులు వేస్తూ టేకు చెట్టు దగ్గరికి చేరి, దాన్ని రెండు చేతులతో కౌగిలించుకుని, ''ఈ క్షణంలో ఈ టేకు వృక్షం నా ప్రియుడు. దిటవు గుండెల నా రేడు,'' అంటూ చెట్టుని ముద్దు పెట్టుకుంది. ఆమె ముఖం నిండా తెల్లటి పొట్టు అంటుకొని...

వారంరోజుల క్రితం తలకో కట్టుతో ప్రత్యక్షమైంది. ''మధ్యాహ్నం ఆబిడ్స్ దగ్గర ఒక ఊరేగింపు తీస్తున్నాము. Cultural Space లాగేసుకుంది ప్రభుత్వం. నిరసనగా నల్లబాడ్జీలతో, పాతికమందయినా లేని ఊరేగింపు పై లాఠీలతో ఎగబడ్డారు పోలీసులు. తోపులాట, నెట్టివేత... వెళ్లి పేవ్‌మెంట్ పైన పడ్డాను. నుదురు బట్ట...''

సుందరానికి ఇదంతా కృతకంగా ఉంటుంది. పదిమందో, ఇరవైమందో సమాజాన్ని మార్చేస్తామంటారు.

సుందరానికి వాళ్లమ్మ గుర్తుకొస్తుంది. ప్రతీరోజు వాళ్ల నాన్న ఏదో ఒక గొడవ. ఆమెకు ఆకుపచ్చని తోటలు, అందమైన ప్రదేశాలంటే ఇష్టం. రంగుల చీరలిష్టం. సాయంకాలాలు ఒక్కతే అట్లా పొలాల వైపు నడుచుకుంటూ వెడుతుంది. గుడి మెట్ల పై కూర్చుని సూర్యాస్తమయాన్ని కళ్లతో తాగినట్లుగా... స్త్రీలలోని ఈ సౌందర్యలాలస సుందరానికి ఇష్టంగా ఉండదు. చెట్ల లోపలి నిప్పు ఏదో అంటుకొని, వీళ్లా ఆకుల సౌందర్యానికి మురిసిపోతూ ఉంటారు. చెట్లు తగలబడే దృశ్యాన్నీ వీళ్లు తెలియ నట్లుగా ఉంటారు. కుటుంబాల్ని ప్రేమించరు. అడవుల్నీ, ఆకాశాల్నీ, సముద్రాల్నీ ఇష్టపడతారు. వాళ్లమ్మ నుంచి ఇప్పటికీ ఒక సమాధానాన్ని అతను ఎదురు చూస్తున్నాడు. ఆమె తిరిగి వస్తే అతను వేసే ఒకే ఒక ప్రశ్న ''ఎందుకు?''

పూర్ణ చెట్టును వదిలేసి, అప్పుడే వెలిగిన స్ట్రీట్ లాంప్ వైపు నడిచింది. తెల్లటి వెలుగు, జలతారు పోగులా ఆ ప్రదేశమంతా రాలుతూ. సుందరానికెందుకో దుఃఖంగా ఉంది. వాళ్లమ్మ గుర్తుకొచ్చినప్పుడల్లా, గాయపడ్డ అతని బాల్యం గుర్తుకొస్తుంది. అమ్మ అదృశ్యమైన కొద్దిరోజులకే తాతగారి మరణం గుండెపోటుతో. తాతగారి సమాధి, పిచ్చి మొక్కలన్నీ పెరిగి, ఎవరో సమాధినీ సగం తవ్వి... పీడకలలోని దృశ్యం. ఒక స్కాండ్రల్ ఊళ్లోకి అడుగుపెడితే అందరూ వాళ్ల గురించే మాట్లాడుతున్నట్లు 'బ్రతికుండగానే తగలబెట్టడం' అంటూంటాడు వాళ్ల నాన్న.

ఇదంతా తేలిగ్గా తీసుకుంటుంది పూర్ణ. ఇంకో వందేళ్లయినా ఆడవాళ్ల హృదయాలు మీకు అర్థం కావు. Morphology of history మీకు అర్థం కాదు.

కొన్ని నెలలుగా వాళ్లిద్దరూ కలసి జీవిస్తున్నారు. Living in relation. పెళ్లి చేసుకుందామంటూ పూర్ణ పోరుతూనే ఉంది. సాయంకాలం ఏడు దాటింది. పూర్ణ ఇంకా తనివి తీరనట్లు, చెప్పులు లేకుండా విహారం చేస్తుంది. "చూడు, పావురాలు ఈ ఆకుల్ని ముద్దు పెట్టుకుంటున్నాయి," అంటుంది.

సుందరానికి విసుగ్గా ఉంది. అంత attachment ఏమీ కనబడలేదు. సన్నటి మంచుతెర అలుముకుంది. పొగలాంటిదేదో ఆ ప్రదేశాన్ని కమ్ముకుంటున్నట్లుగా ఉంది.

"సిటీలో మనం కేన్సర్ పేషంట్లలా బ్రతికేస్తున్నాము. ఈ ఈవెనింగ్ వాక్, ఈ చెట్ల పచ్చదనం మనకు కీమోథెరపీలా పనిచేస్తాయి," అంది పూర్ణ. హఠాత్తుగా వాళ్ల నాన్న గుర్తుకొచ్చాడు సుందరానికి. పెళ్లి గురించి వాళ్ల నాన్నతో మాట్లాడిన సంగతి పూర్ణకు చెప్పాలని...

ఇద్దరూ వెనక్కు బయలుదేరారు. ఇట్లా అమెరికన్ లైబ్రరీ పై నుండి ఓల్డ్ హాస్టల్ వైపు నుంచి వెళ్దామంది పూర్ణ.

కారు మెల్లగా పోనిస్తూ- "నాన్న మన పెళ్లికి ఒప్పుకున్నాడు. పెళ్లి తిరుపతిలో చేద్దాం అన్నాడు. కాకపోతే ఒక కండీషన్ చెప్పాడు. బంధువులకు నిన్ను మా కులపు అమ్మాయిలా పరిచయం చేస్తానన్నాడు. నీ పేరు కూడా 'మేరీపూర్ణ' అని కాకుండా 'లక్ష్మీపూర్ణ' అని కార్డులో ప్రింట్ చేద్దామన్నాడు," భయం భయంగానే చెప్పాడు సుందరం.

దూరంగా రోడ్డు పై ఎర్రటి రక్తపుచారలు కనబడి, కారు ఆపు అని అరిచింది పూర్ణ. సడెన్ బ్రేక్ వేశాడు సుందరం. రోడ్డు పై రక్తపుచారలు. రోడ్డు అంచున తెల్లటి కుందేలు పిల్ల. దాని శరీరం మధ్య నుంచి మోటారు సైకిల్ వెళ్లినట్టుంది. కొద్దిగా ఊపిరుంది. శరీరంలో కదలికలు ఉన్నాయి. దాని ముఖం నిండా భరింపలేని బాధ ఏదో కనబడింది పూర్ణకు. దాని పక్కన కూర్చుంది పూర్ణ. పర్సులోంచి కీ చెయిన్ బయటకు తీసింది. కీ చెయిన్‌కున్న పాకెట్ నైఫ్ బయటకు తీసింది. "ఏం చేస్తున్నావు?" పెద్దగా అరిచాడు సుందరం.

"దాని మెడను కోస్తాను. బాధ నుంచి దాన్ని విముక్తం చేస్తాను," అంది.

కత్తితో దాని లేత మెడను కోసింది. రక్తం బొట్టుబొట్లుగా పడింది ఆమె చీర నిండా. దాని శరీరంలో చలనం ఆగిపోయింది.

సమస్తం నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా ఉంది. పూర్ణ రోడ్డు అంచున సన్నటి గోతిని తవ్వుతుంది, దాన్ని పూడ్చి పెట్టడానికి.

సమస్తం నిశ్శబ్దంగా చప్పుడు చెయ్యని ప్రార్థనలా. అభిప్రాయాలు, నమ్మకాలు అన్నీ ఏదేదో అయిపోయి, ఆ సాయంకాలం వాళ్లిద్దరిని తనలోకి లాక్కున్నట్టుగా,

దేన్నీ తోసివెయ్యలేము, ఏదీ మన నుంచి అదృశ్యం కాదు అనుకున్నాడు సుందరం. కారు బాయ్‌నెట్‌ని ఆనుకుని ఆ దృశ్యాన్ని దీక్షగా చూస్తున్నాడు. రెండు చేతులతో మట్టిని తోడిపోస్తోంది పూర్ణ. పక్కనే నిర్జీవమైన కుందేలు పిల్ల. తెలియని దుఃఖమేదో తోసుకొచ్చింది సుందరానికి. కాళ్లు వణికాయి. వాళ్లమ్మ గుర్తుకొచ్చింది. ఆమె బ్రతికే ఉండి ఉంటుందా? పూర్ణలో పెరిగే (రెండు నెలల) శిశువు గుర్తుకొచ్చింది. ఎబార్షన్ చేయించుకోవాలన్న పూర్ణ నిర్ణయం గుర్తుకొచ్చింది. ఆ నిశ్శబ్దంలో పక్షులన్నీ ఏదో పూనినట్టు పెద్దగా అరుస్తున్నాయి, ఎవరో కత్తితో పక్షుల మెడలన్నీ నరికి వేస్తున్నట్లు. రోడ్డు పక్కనున్న రావిచెట్టు ఒకటి గాలి అలలకు సన్నటి చప్పుడు చేస్తుంది. పక్షుల అరుపులు ఆగిపోయాయి. పూర్ణ పూనికతో గోతిని తవ్వుతుంది. ఆ దృశ్యం అంతా సెల్ఫీఫోటోలా, ఈ సాయంకాలం ఒక మెటాఫర్‌లా తోచింది. కానీ ఏది కారణం, ఏది ప్రభావం అతనికి అర్థం కాలేదు. సన్నటి మంచుతెర, అతన్ని, ఆ ప్రదేశాన్ని ఒక వలలా కప్పేసింది.

ఆ సాయంకాలం ఎనిమిది గంటల నుంచి మరుసటిరోజు సాయంకాలం ఎనిమిది లోపల పూర్ణ జీవితంలో రెండు ముఖ్యమైన సంఘటనలు జరిగాయి.

ఇంటికి వెడుతూనే, "నువ్వీ రోజుకి, ఎవరైనా ఫ్రెండ్ గదికి వెళ్లు. నన్ను ఒంటరిగా ఉండనివ్వు," అంది. ఇంట్లోకి వెళ్లగానే తలుపులు మూసేసి ఇల్లంతా సర్దడం మొదలుపెట్టింది. పాత న్యూస్‌పేపర్లు, వీక్లీలు, మాగజైన్లు, వెనుక గదిలోకి విసిరేసింది. Unwanted things అన్నీ- కాండోమ్ పాకెట్లు, సిగరెట్ పాకెట్లు, పగిలిన బీరు బాటిళ్లు, అంతట్నీ బయటకి విసిరేసింది. ఇల్లు సర్దే నెపంతో జ్ఞాపకాలన్నింటినీ బయటకు విసిరేయాలని పూర్ణ ఆలోచన.

సర్దటం అయినాక, బాత్‌రూమ్ కెళ్లి తలస్నానం చేసి శరీరం పై చక్కిలిగింతలు పెట్టే సబ్బు నురగను చాలాసేపు ఎంజాయ్ చేసింది. కొత్త చీర, తనకిష్టమైన కానరీ ఎల్లో కలరు చీరను కట్టుకొంది. కాఫీ చేసుకొని, కిటికీ దగ్గర కూర్చుని వీధి వైపు చూస్తూ. రోడ్డు పై మోటార్ బైకులపై కూర్చుని సిగరెట్లు కాలుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు కాలేజీ పిల్లలు. హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చి సెంట్రల్ యూనివర్సిటీలో పనిచేస్తున్న తమ బంధువుల కుర్రాడికి ఫోన్ చేసింది. అవీ ఇవీ మాట్లాడి "నన్నేదయినా హోటల్‌కి తీసుకెళతావా, డిన్నర్ కి," అని అడిగింది. "నాన్ వెజిటేరియన్ హోటల్‌కి, కుదిరితే పారడైజ్!" అంది. తొమ్మిది గంటలకు వాళ్లిద్దరూ పారడైజ్‌లో ఉన్నారు. ఇష్టంగా అతనితో కబుర్లు చెప్పింది. పదిగంటలకు ఇద్దరూ హోటల్ నుంచి బయట పడ్డారు. 'నా శరీరం మైలపడింది. నన్ను గట్టిగా కౌగిలించుకోవా?' అని అడగాలనుకుంది. తన ఇంటి కొచ్చినాక, అతనికి గుడ్ బై చెబుతూ, అతని ముఖాన్ని దగ్గరకు లాక్కొని అతని జుట్టుని వేళ్లతో నిమిరి, "థ్యాంక్యూ ఫర్ ది ఈవెనింగ్," అంది.

మర్నాడు సాయంకాలం ఏడు గంటలకు హాస్పిటల్‌కి రమ్మని సుందరానికి కబురుచేసింది. లోపల పేషంట్ల గదిలో వెయిట్, బి.పి. చూశారు. అక్కడే గదిలో నిలువెత్తు అద్దం ఉంది. అద్దంలోని తన శరీరం వైపు చూసుకుంది పూర్ణ. శరీరపు రంగు తెల్లగా (వెన్నెల వెలుగులా), బ్రా పాంటీల కంపెనీల అడ్వర్టైజ్‌మెంట్లలోని అమ్మాయిలా... స్తనాలు పెద్దవిగా, అతి జాగ్రత్తగా ఇంజనీరింగ్ స్కిల్స్‌తో తయారు చేయబడ్డ స్త్రీలా... మెస్మరైజింగ్ శక్తులన్నీ తన లోపల ఇమిడినట్టుగా.

సుందరం కలలో నడుస్తున్నవాడిలా ఆమెతోపాటు లోపలికి వచ్చాడు. దూరంగా నిలబడి పూర్ణ వైపే చూస్తున్నాడు. సుందరం కథ ఎంతో విషాదం. మరణాన్ని దగ్గరిగా చూడబోతున్నవాడిలా. డాక్టరు వచ్చింది. మనోహరమైన విషయాలుగా భావించే శరీర అవయవాల్ని ఒట్టి పరికరాలతో చూస్తూ, పరీక్షిస్తూ. 'చూడు ఇవి ఒట్టి అవయవాలు. వీటిని రొమాంటిసైజ్ చేస్తూ రంగురంగుల బ్రాలు, పాంటీలు అలంకరించి, ఇంద్రధనుస్సు రంగుల చీరల్ని కప్పి... ఇది శరీరం, ఒట్టి డస్ట్ బిన్,' అనుకొంది పూర్ణ. అద్దంలోని పూర్ణ వైపు కన్నుగీటుతూ, 'ఉమన్ హుడ్, మదర్ హుడ్ ఇవన్నీ చెప్పొద్దు. ఇదో తప్పనిసరి రిస్క్. Risk of love, risk of relation; ఇప్పుడీ హింస, మరణం నా కోరిక, నా అవసరం,' అనుకుంది పూర్ణ. మళ్లీ అద్దంవైపు చూసింది. అద్దంలోని పూర్ణ వైపు సామాన్యంగా చూసింది.

పూర్ణ ఒక్కతే బెడ్ పై పడుకుంది. పరీక్షలు జరుగుతున్నాయి. శరీరంపై ఆకు పచ్చని వస్త్రం కప్పి, డాక్టర్ ఒన్ వెళ్లిపోయింది. డాక్టరు టూ రావాల్సి ఉంది. ప్రొసీజర్ ఆమే చేసేది. పూర్ణకు సుందరం గుర్తొచ్చాడు. లోపలికి పిలవాలనుకుంది. సుందరం జ్ఞాపకాలన్నింటికీ నిప్పు అంటుకుంది. పూర్ణ కళ్లు ఎరుపురంగులో ఉన్నాయి. ఆ క్షణంలో డాక్టరు టూ వచ్చి లోపలి అవయవాల్ని కెలికే పనిలో పడింది. ఎవరో వచ్చి కాగితాలపై సంతకాలు పెట్టాలన్నారు. సుందరాన్ని పిలవదలుచుకోలేదు. తనే పెట్టింది. క్రమంగా పూర్ణను మత్తు ఏదో కమ్ముకుంది.

రాత్రి పది గంటల సమయంలో హాస్పిటల్ బయటకు వచ్చింది. సుందరం బయటే ఎదురుచూస్తున్నాడు. రెక్కలు విప్పుకు నడుస్తున్న హంసలా సుందరం కారుని వద్దని చెప్పి, పేవ్‌మెంట్ పై అడుగులు మోపింది. అట్లాగే పేవ్‌మెంట్ పై నడుస్తూ, పూలమ్మే పిల్ల దగ్గర ఆగి రెండు మూరలు మల్లెదండలు కొనుక్కుని, జడలో తురుము కొని ఇంకాస్త దూరం నడిచి, టీ షాపు దగ్గర ఆగి, ప్లాస్టిక్ కప్పులలో టీ తీసుకుని, కాస్త నీరసం అనిపించి పేవ్‌మెంట్ పైనున్న బండపై కూలబడి... సుందరం కారు తన వెనకే వస్తుంది. 'నువ్వు కలుగులోని ఎలుకవి,' అంది పూర్ణ లోపలి పూర్ణతో. 'షటప్. నేనో ఫెయిరీ టేల్‌ని... చూడు నా భుజానికి, అటూ ఇటూ రెక్కలున్నాయి,' అంది లోపలి పూర్ణ. 'అదుగో సుందరం, బోనుని వెంటబెట్టుకొని నీ వెనుకే వస్తున్నాడు,' అంది లోపలి పూర్ణ.

లేచి నిలబడి, భుజానికున్న రెక్కల్ని తడుముకుని, చివరిసారిగా సుందరం వైపు చూసి, గాలివాటం వైపు నిలబడి, ఎగిరి, అక్కడ నుంచి అదృశ్యమైపోయింది పూర్ణ.

## 3

పూర్ణ ఆ కాగితాలను మడిచి మళ్లీ ఆ కవర్లో పెట్టింది. బయట కాంతి సన్నటి వెలుగుజల్లులా లోపలికి తోసుకొస్తోంది. కాగితం పై అక్షరాలన్నీ అల్లుకుపోయి ఒక్కొక్క పదాన్ని కాగితం పై నుంచి ఏరుకుని చదువుకోవాల్సి వస్తుంది. ఇందులో కథ ఎంత, నిజం ఎంత పూర్ణ ఆలోచిస్తుంది. ఒక సుందరం ఉండేవాడు. వాడికి ఒక గతం, గతం నుంచి వెంట తెచ్చుకున్న ఒక గాయం ఉండేవి. అతనంటే పూర్ణకి జాలి వుండేది, ప్రేమ ఏమో? పూర్ణకు సుందరం గుర్తుకు రాగానే మనోహరమైన భావం, పులకింత లాంటివి ఏమీ కలగలేదు.

ఒక నలుపు తెలుపు చిత్రాన్ని రంగు రంగుల పెయింటింగ్‌లా మార్చాడు ఈ రచయిత. అబార్షన్ నిజమే, కానీ అందులో సుందరం పాత్ర ఎంతో పూర్ణకు గుర్తు రావడం లేదు. పేరు మార్చుకుని తిరుపతిలో పెళ్లి చేసుకుందాం అనే ప్రతిపాదన మాత్రమే గుర్తుంది. రెండవ కవర్ తెరిచింది పూర్ణ. పూర్ణ మాణిక్యం రెండవ ప్రేమకథ అంటూ మొదలైంది రెండవ ఉత్తరం.

*పూర్ణ మాణిక్యం రెండవ ప్రేమకథ*

ప్రకాశానికి ఋతువులంటే ఇష్టం. ముఖ్యంగా కలలు విరిసినట్లు ఉండే వసంతకాలం. ఇంకెక్కడి ఋతువులు. ఋతువులన్నీ జామ్ అయిపోయి ఇప్పుడొక్కటే వేసవికాలం వుంది అనేది పూర్ణ. శని, ఆదివారాలు కారు తీసుకుని వచ్చేవాడు ప్రకాశం. శ్రీశైలం అడవులనేవాడు లేదా అరకులోయలనేవాడు. ఈ ప్రయాణాలన్నీ ఆత్మకథ లాంటి జ్ఞాపకాల సంచిని విప్పుకోవటంలాంటిది అనుకునేది పూర్ణ.

పోయిన వేసవి చివర్లో ప్రకాశంతో పరిచయమయ్యింది పూర్ణకు. అతని కళ్లు దిగులుగా దుఃఖంగా వుండేవి. ఆ కళ్లను చూసి ఇష్టపడింది పూర్ణ. ఆ కళ్ల దుఃఖం వెనుక కథలేవో ఉన్నాయనిపించేది. ఆ కథల కోసమే అతనితో స్నేహం చేసేది పూర్ణ. ఒక ఎఫైర్‌లా మొదలైంది వాళ్ల స్నేహం. ఈ కథలు సేకరించడం అర్షద్ నుంచి ఒక బలహీనతలా పూర్ణకి అంటుకుంది. ఇరవై రెండేళ్ల పూర్ణకు అర్షద్ ఒక మాంత్రికుడిలా కనబడేవాడు. అర్షద్ యూనివర్సిటీ వదిలేసినా ఎప్పుడూ క్యాంపస్‌లోనే కనబడేవాడు. పదిమంది కుర్రాళ్లను ఎప్పుడూ కూర్చోబెట్టుకుని గంభీరమైన విషయాలు చర్చించే వాడు. రాత్రిపూట హాస్టల్ బయట కూర్చుని మనోహరమైన పాటలు పాడేవాడు. అవి పల్లెల నుంచి సేకరించేవాడు.

అర్షద్‌తో పూర్ణ పరిచయం చాలా వింతగా జరిగింది. లైబ్రరీ మెట్ల పైన కూర్చుని దస్తోవ్‌స్కీ నవల 'క్రైమ్ అండ్ పనిష్మెంట్' చదువుతోంది. 'నీ పేరు నటాషా కదూ,' అంటూ వచ్చి ఆమె పక్కనే కూర్చున్నాడు. మరొకసారి పూర్ణ ఎదురైనప్పుడు, 'నాతో ఒక చోటుకు వస్తావా,' అంటూ ఆమెను బయలుదేరదీశాడు. 'కలెక్టరేట్ ముందు ధర్నా, రా టెంట్‌లో కూర్చుందాం,' అంటూ లోపలికి తీసుకువెళ్లాడు. ఎవరో వచ్చి రెండు దండలు వేశారు. 'ఈరోజు నిరాహార దీక్ష మన వంతు,' అన్నాడు. సాయంకాలం ఆరు గంటలకు పూర్ణ నీరసించిపోయింది. కళ్లు తిరుగుతున్నట్లయితే పసి పాపలా ఆమెను భుజానికి ఎత్తుకుని హాస్టల్‌కి తెచ్చాడు. కథలు సేకరించటం ఆమెకు ఇష్టం. పల్లెల కథలు, పల్లెల పోరాటాల కథలు, అవన్నీ తెచ్చి పూర్ణకు వినిపించేవాడు. ప్రతి మనిషి ఒక కథ, ప్రతి దుఃఖం ఒక పాట అనేది అర్షద్ తీరు. అర్షద్ ఇప్పుడు లేడు. అర్షద్ జ్ఞాపకంగా అతను రాసిన 'ది స్టోరీ ఆఫ్ అవర్ టైమ్స్' పుస్తకాన్ని దాదాపు 24 గంటలూ తన చేతిలో ఉంచుకునేది పూర్ణ. అర్షద్ మరణం, అతని చివరి క్షణాలు పూర్ణకు తెలుసు.

అర్షద్ గురించి ప్రకాశానికి చెప్పింది పూర్ణ. అర్షద్ నా సహచరుడు, నా ప్రాణం. అతను విడిపోదామని సజెస్ట్ చేశాడు, నేను మౌనంగా ఆ రిలేషన్ నుంచి బయటకు వచ్చాను. నో ఫీలింగ్స్ అన్నాడు ప్రకాశం త్యాగమూర్తిలా ఫోజుపెట్టి. ఈ ప్రకాశంతో సహా కొన్ని వందలమందికి ఇదే కథ వినిపించేది పూర్ణ. అర్షద్ చనిపోయాడు అనే విషయం ఆమెకు ఇష్టం ఉండేదికాదు. ఈ ప్రకాశం మన కులంవాడే, నిన్ను ఇష్టపడుతున్నాడు అంటూ అమ్మ కబురు పంపింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మృదువైన ఆడపిల్లలాంటి రూపం. ముఖ్యంగా కళ్ల వెనుక ఉండే సంచులు నన్ను అతన్ని ఇష్టపడేలా చేశాయి. నుజ్జునుజ్జయిన అర్షద్ శరీరం ఆమెకు గుర్తుంది. మార్చురీలో అతని శరీరాన్ని గుర్తించటానికి ఎవరూ రాలేదు. పూర్ణ ఒక్కతే. పోలికలు తెలియడానికి ముఖం అక్కడ లేదు. కొంత మాంసం కొంత కండ తప్ప. అతని చేతులని తన చేతుల్లోకి తీసుకుని భరోసానిచ్చే యోధుడి చేతుల్లాగా ఆ చేతుల బలమో, ఆ చేతుల ప్రేమ స్పర్శ ఆమెకు తెలుసు. అది అర్షద్ శరీరమే అని పూర్ణ అనే యూనివర్సిటీ అమ్మాయి గుర్తు పట్టిందని పోలీసులు తమ కాగితాల్లో రాసుకున్నారు. ఆశ్చర్యంగా ఆరోజు నుంచి పూర్ణ చేతులు స్పర్శను కోల్పోయినట్లుగా అయ్యాయి. ప్రకాశం అందంగా వుంటాడు, అందంగా మాట్లాడుతాడు, పదే పదే ఒక నాస్టాల్జియాలోకి వెళ్లిపోతాడు. ఖరీదైన బట్టలు, షూస్, గాగుల్స్... అతను మ్యూజియంలో ప్రదర్శనకి పెట్టిన ఖరీదైన వస్తువులా వుంటాడు.

అర్షద్, పూర్ణ ఇట్లాగే శని, ఆదివారాలు బయటకు వెళ్లేవారు. అయితే అది సైట్ సీయింగ్ కోసం కాదు. అడవుల లోపల దూరంగా విసిరేసి వుండే పల్లెల వైపు వెళ్లేవారు. మనుషులను కలవడం అర్షద్‌కు ఎంతో ఇష్టం. అతనికి ఆ పల్లెలన్నీ తెలుసు.

ఆ మనుషులు అందరూ తెలుసు. గుడ్డిదీపం, కిటికీలోంచి దూసుకొచ్చే తెల్లటి వెన్నెల, చిన్న చిన్న గుడిసెలు అతని పాటశాలలు. పొద్దుబోయేవరకూ వాళ్ల కథలన్నీ వినేవాడు. ఒకొక్కడు ఒక్కో కథ. ప్రపంచమంతా ఇట్లాగే ఉందని వాళ్లకు చెప్పేవాడు. ఆ పాట శాలలో కబుర్లు మాత్రమే కాదు, అతనొక అద్భుతమైన పాటగా మారేవాడు. వెనుక కూర్చున్నవాళ్లలో ఎవడో కుండ పైన దరువేస్తూ రాత్రంతా, ఆ ప్రాంతం అంతా విని పిస్తూండేవాడు. రాత్రంతా పల్లెలు దాటుకుని రాత్రివేళ వెళ్లి అడవుల మధ్య ప్రయాణం చేసేవాడు. నేరేడుపళ్లు, జామపళ్లు, గుప్పెడు సన్నజాజులు, చెట్ల మధ్యన ఆకుల పరుపు పై విడిది చేసేవాళ్లు. ఇన్నేళ్ల తర్వాత కూడా అర్షద్ జ్ఞాపకం అడవిపూల వాసనలా ఆమెను పరవశింప చేస్తూనే వుంటుంది. ఆ జ్ఞాపకాలల్లోంచి అర్షద్ మరణాన్ని మాత్రమే వేరు చేసేది.

రోడ్డు పక్కన కారు ఆపి ప్రకాశం తను తీసుకొచ్చిన స్వీట్స్‌ని, టీ నిండిన ఫ్లాస్క్‌ని బయటకు తీశాడు. ప్రకాశం తన భవిష్యత్తుని లేదా వాళ్లిద్దరి భవిష్యత్తుని చెప్తున్నాడు. వీసా సంపాదించడం, అమెరికా వెళ్లిపోవడం, అమెరికాలో పూర్ణకి ఒక ఉద్యోగం ఇప్పించడం అని చెప్పాడు. పూర్ణ ఊఁ కొడుతోంది కానీ అవేవీ ఆమె మైండ్‌కి ఎక్కడంలేదు. అర్షద్‌తో కలసి తిరిగిన ప్రదేశాలు, నీళ్లతో నిండిన వరిపొలాలు, కంది చేలు, చేల మధ్య వంగి పనులు చేసే కూలీలు, వాళ్లల్లోంచి ఎవరో గొంతెత్తి పాడే పల్లెపదాలు. అర్షద్ చేతిలో ఎప్పుడూ పెద్ద పెద్ద నోట్‌బుక్స్ ఉండేవి. సంచీ నిండా పుస్తకాలు... ఇద్దరూ కథలని వెంటాడేవాళ్లు. దొమ్మీలు జరిగిన పల్లెలు, ఇళ్లు పడగొట్టిన పల్లెలు... అర్షద్ వాళ్లని ఇంటర్వ్యూ చేస్తూండేవాడు. పూర్ణ ఆ గుడిసెలో తిరిగి ఆడవాళ్ల ముచ్చట్లు సంగతులు విని, వాళ్లిచ్చే బెల్లం కాఫీ తాగి, ఒక్కోసారి పల్లెల్లో పెళ్లిళ్లు ఎదురైనాయి, తాటాకుల పందిర్లు, మనోహరమైన పల్లె వాసన, కొన్ని తలంబ్రాలు జేబులో వేసుకుని తిరిగి వచ్చేటప్పుడు పూర్ణ తల పై చల్లేవాడు అర్షద్. వారం తరువాత పూర్ణ, అర్షద్ కలసి తయారుచేసిన ఆ కథ ఎక్స్‌ప్రెస్‌లోనో, హిందూలోనో వచ్చేది. అర్షద్ పేరు పక్కన కామా పెట్టి P.M. అంటూ ఆమె పేరు కూడా తగిలించేవాడు.

శ్రీశైలం అడవుల నుంచి తిరిగొచ్చినాక పూర్ణ ఇంటికి కబురుచేశాడు- పూర్ణ తనకు బాగా నచ్చిందని, పెళ్లి గురించిన ఏర్పాట్లు మాట్లాడుకుందాం అని. ప్రకాశం పూర్ణను ఒక ఖరీదైన హోటల్‌కి తీసుకెళ్లాడు. డిన్నర్‌తో పాటు కాస్త విస్కీ కూడా తీసుకున్నాడు ప్రకాశం. నా రూమ్ చూద్దువుగానీ రా అంటూ ప్రకాశం పూర్ణని తన అపార్ట్‌మెంట్‌కి తీసుకెళ్లాడు.

వెన్నెల మందంగా కిటికీల ద్వారా అపార్ట్‌మెంట్ లోపలికి ప్రవహిస్తోంది. ప్రకాశం పూర్ణని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. హఠాత్తుగా పూర్ణ శరీరం స్పర్శను కోల్పోటం మొదలుపెట్టింది. చేతులు, కాళ్లు, పెదాలు శరీరంలో అన్నీ

అవయవాలు ఊపిరి పోగొట్టుకుని నిర్జీవంగా అయిపోవడం పూర్ణకు తెలుస్తోంది. 'యూ బ్లడీ కోల్డ్, ఫ్రిజిడ్ బిచ్,' అంటూ పూర్ణని మంచం పై నుంచి క్రిందకి తోశాడు ప్రకాశం. జుట్టు ముడి వేసుకుని, పైటను భుజాలపై మూసుకుని రాత్రి రెండు గంటల సమయంలో ఒక్కతే తన రూమ్‌కి చేరింది పూర్ణ. తన బెడ్ పై పడుకోగానే పూర్ణకు నిద్ర మత్తులా కమ్ముకుంది. నిద్రలో మనోహరమైన కల. జడ నిండా మల్లె పూలు, అర్షద్ బాహువుల్లో పూర్ణ. వందలాది ముద్దులు, గాఢ పరిష్వంగం, వందలాది ఆర్గాజామ్‌లు. ఆ ఉదయం నిద్ర నుంచి లేస్తూ పూర్ణకి బదులు ఒక శృంగార దేవత ఆ గదిలో ప్రత్యక్షమైంది. రెండ్రోజుల తర్వాత పూర్ణకు వాళ్లమ్మ ఒక ఉత్తరం రాసింది.

పూర్ణా,

రోజులు గడిచిపోతున్నాయి. నీ శక్తి అంతా నిన్ను నువ్వు గాయపరుచుకోవటానికే వాడుతున్నావు, నీ లోపలి సున్నితత్వాన్ని మొద్దుపరుచుకుంటూ. నీ గురించి నాకెన్నో గొప్ప ఆశలు, కలలు ఉన్నాయి. అవి నెరవేరుతాయని నమ్ముతూ వస్తున్నాను.

చాలా మరణాలకి అవసరమైనంత దుఃఖపడ్డావు. ఇక చాలు. అర్షద్ అనే ఒక జ్ఞాపకాన్ని ఎక్కడైనా పాతిపెట్టు. కొంచెం ప్రయత్నిస్తే మరో అర్షద్, మరో ప్రేమ దొరుకుతాయి. ప్రేమకథ హఠాత్తుగా ఆగిపోయి ఫుల్‌స్టాప్‌గా ఆగిపోదు. మన కోసం ఎదురుచూసే ఒక మనిషి ఉంటూనే ఉంటాడు. కొత్తగా మళ్లీ జీవించడం మొదలుపెట్టు. ఒక ఉద్యోగమో, వ్యాపకమో మొదలుపెట్టు. ఎవడో ఒకడు ఒక ప్రేమతో నీకు ఎదురవుతాడు.

మరో కొత్త ప్రేమకథను మొదలుపెట్టు. నీ కోసం చేసిన సున్నుండలు స్టీలు డబ్బాలో అట్లాగే వున్నాయి. నువ్వు ఈ కథల వేట మానివేసి మళ్లీ కొత్త ప్రేమకథ మొదలుపెట్టి ఆ కబురుతో ఇంటికి రా. నీ నోటిని సున్నుండతో తీపి చేస్తాను!

-అమ్మ

గదిలో కూర్చుని వాళ్లమ్మ ఉత్తరాన్ని భద్రంగా పర్సులో దాచిపెట్టి, అర్షద్ రాసిన 'హిస్టరీ ఆఫ్ అవర్ టైమ్స్' పుస్తకాన్నీ తెరిచింది పూర్ణ. అర్షద్‌కి ఇష్టమైన గులాం అలీ గజల్ 'చుప్కే చుప్కే రాత్ దిన్...' గదినిండా ప్రవహింపచేసి వాళ్లమ్మకు ఉత్తరం రాయడం మొదలుపెట్టింది పూర్ణ. ఒకే ఒక వాక్యం ఉంది ఆ ఉత్తరంలో- 'మరొక కొత్త ప్రేమకథలో ఇంటికి తిరిగి వస్తాను' - అంటూ.

## 4

పూర్ణ రెండవ ఉత్తరంవైపు ఆశ్చర్యంగా చూసుకుంది. తన మనస్సులో రహస్యంగా దాచుకున్న కబుర్లన్నీ ఉత్తరం రాసిన రచయితకు ఎలా తెలిశాయో అర్థం కాలేదు. ఇప్పుడు అర్షద్ రాసిన పుస్తకం ఆమె దగ్గర లేదు. గులాం అలీ పాటలు కూడా.

ఆ కాలంలో అక్కడే ఆ ప్రేమకథను వదిలేసి చాలా ముందుకు వచ్చింది పూర్ణ.

**5**

నెలరోజుల తర్వాత పూర్ణకు చూపు మెల్లమెల్లగా వచ్చింది. ప్రపంచం అచ్చం ప్రపంచంలాగా కనిపిస్తుంది, సాగతీతలు, కుంచించుకుపోవడాలు లేకుండా. కొత్త కళ్లజోడు. అందులోంచి ఈ అపార్ట్‌మెంట్. రాత్రివేళ ఎప్పుడూ ఫోన్ కాల్స్ వస్తూనే ఉంటాయి. ఆ ఫోన్ కాల్స్‌లో మనోహర్ గొంతు వినిపిస్తుంది. నేను తిరిగి వస్తాను అంటూ గంభీరమైన శబ్దం వినిపిస్తుంది. గాజు కిటికీ దగ్గర నిలబడి చూస్తే ఆకుపచ్చని గాలికి మనోహరంగా తలలు ఊపే వాటి ఆకులు... ఆ దృశ్యాన్ని ఇష్టంగా చూస్తుంది పూర్ణ. అప్పుడప్పుడు ఆ చెట్ల మధ్య మనిషి ఎవరో నిలబడి తన కిటికీ వైపే చూస్తు న్నట్లుగా అనిపించేది పూర్ణకి. కళ్లజోడు పెట్టుకుని మరింత దీక్షగా దగ్గరగా చూస్తుంది పూర్ణ. తనకి బాగా పరిచయమైన మొహంలా చూస్తుంది. కాసేపు అర్షద్‌లాగానూ, కాసేపు సుందరంలాను, కాసేపు ప్రకాశంలాను, కాసేపు మనోహర్‌లానూ కనిపిస్తుంది ఆ రూపం.

సన్నగా నవ్వుకుంటుంది పూర్ణ.

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక*
*జనవరి 2017*



డా॥ వి. చంద్రశేఖరరావు 13 ఏప్రిల్ 1959న ప్రకాశం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ **నైట్ డ్యూటీ** 1990లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయింది. వందకుపైగా కథలు రాశారు. జీవని, లెనిన్ ప్లేస్, మాయలాంతరు, ద్రోహవృక్షం, చంద్రశేఖరరావు కథలు కథాసంపుటాలు, మూడు నవలలు ప్రచురించారు. రైల్వేలో ఉన్నత పదవిలో 2017 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. 8 జులై 2017న మరణించారు.